క్లుప్తంగా

రెవెన్యూ సంబంధిత సమస్యలు పరిష్కరించాలి

చందంపేట : రెవెన్యూ సంబంధిత సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం చందంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రజావాణి దరఖాస్తులు, వాటి పరిష్కారాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు, ఎంపీపీ పార్వతి, తహసీల్దార్లు శ్రీనివాస్, గోవర్ధన్, ఎంపీడీఓ లక్ష్మి, ఆర్ఐ నజీర్ తదితరులు ఉన్నారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

హాలియా : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి గెస్ట్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరంగి రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు–1, ఆంగ్లం– 2, కామర్స్ –2, కంప్యూటర్ సైన్స్ లేదా కంప్యూటర్ అప్లికేషన్–1, పొలిటికల్ సైన్స్–1, బోటనీ–1, జూవాలజీ–1తో కలిపి మొత్తం 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత పీజీ సబ్జెక్టులో 55శాతం, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు ఉంటే అర్హులని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ కలిగిన వారితో పాటు బోధనానుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల జూలై 3వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా కళాశాలల్లో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూ తేదీ దరఖాస్తు చేసిన అభ్యర్థులకు తరువాత తెలపనున్నట్లు తెలిపారు.

రేపు మెగా టాలెంట్ టెస్ట్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని కేవీఆర్ నవోదయ సెంటర్‌లో ఆదివారం మెగా టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఇన్‌చార్జ్ కాతోజు వినోద్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్ ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 4, 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు మెగా టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభను చాటితే కేవీఆర్ నవోదయ ఎంట్రన్స్ కోచింగ్ సెంటర్‌లో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఈ కోచింగ్ సెంటర్‌లో హాస్టల్ వసతి సౌకర్యం కూడా ఉందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం ఫోన్ నంబరు 9010894070ను సంప్రదించాలని కోరారు.

యువజన సంఘం డివిజన్ కో కన్వీనర్‌గా రాజీవ్

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం మిర్యాలగూడ డివిజన్ కో కన్వీనర్‌గా పట్టణానికి చెందిన దైద రాజీవ్‌ను నియమిస్తూ ఆ సంఘం డివిజన్ కన్వీనర్ల్ శంకర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి అన్ని విధాలుగా సహకరించిన నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

వ్యక్తిగత ఘర్షణకు కాంగ్రెస్ నాయకులకు సంబంధం లేదు

మిర్యాలగూడ : పార్లమెంట్ ఎన్నికల సమయంలో దామరచర్లలో జరిగిన వ్యక్తిగత ఘర్షణకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు సంబంధం లేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం దామరచర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్ నాయక్‌పై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైన బీఆర్ఎస్ నాయకులు తమ కుట్రపూరిత ఆలోచనలు మానుకోని కాంగ్రెస్ పార్టీపై, నాయకులపై బురద చల్లడం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో జనార్దన్‌నాయక్, బాషానాయక్, లింగానాయక్, కందుల నరసింహారెడ్డి, అల్లం నాగరాజు, పగిడి జీడయ్యయాదవ్, నాగునాయక్, కొమ్ము దాసు, శివకుమార్, కృష్ణానాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఆప్ నేతల వినతి

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లలో విరిగిపోయిన పరికరాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం ఆప్ నాయకులు మున్సిపల్ కమిషనర్ ఎండీ యూసుఫ్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆప్ జిల్లా అధ్యక్షులు కుతుబుద్దీన్, నాయకులు ప్రవీణ్‌కుమార్, కీర్తి, అశోక్ తదితరులు ఉన్నారు.

గురుకులాల్లో సీట్ల సంఖ్య పెంచాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : బీసీల జనాభాకు అనుగుణంగా గురుకులాల్లో సీట్ల సంఖ్య పెంచాలని కోరుతూ శుక్రవారం బీసీ గురుకులాల కార్యదర్శి సైదులుకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ వినతిపత్రం అందజేశారు. గురుకులాల సీట్ల కోసం వేలాది మంది బీసీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకుంటే వందల్లో మాత్రమే సీట్లు ఇస్తున్నట్లు తెలిపారు. దీంతో బీసీ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీసీ సంఘం నేతలు మహేష్, నాగేందర్, కోండల్, శ్రీనువాస్ తదితరులు ఉన్నారు.

పడకేసిన పల్లె పాలన

- పత్తాలేని ప్రత్యేక అధికారులు
- కార్యదర్శులపై పనిభారం
- చెత్త సేకరణ వాహనాలకు డీజిల్, బోర్ల మరమ్మతులకు నిధులు కరువు

హాలియా : గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడం, ప్రత్యేక అధికారులు పత్తా లేకపోవడం..ఉన్న కార్యదర్శులపైనే తీవ్ర పనిభారం పెరగడం..15వ ఆర్థిక సంఘం నిధులు రాకపోవడం ..కార్మికులకు నెలల తరబడి వేతనాలు అందకపోవడం..మొత్తంగా గ్రామపంచాయతీల్లో పాలన పడకేసింది. ఈ ఏడాది జనవరి 31న ప్రభుత్వం క్లస్టర్ గ్రామాలుగా ఎంపిక చేసి సాగర్ నియోజకవర్గంలోని 189 పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. అయితే వీరికి నిధులు, విధులపై స్పష్టత లేకపోవడంతో ప్రధాన సమస్యగా మారింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీల ఖాతాలు ఖాళీ అయ్యాయి. కనీసం విద్యుత్ బల్బులు, బోరు మరమ్మతులు, ట్రాక్టర్‌కు డీజిల్ కొనలేని పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు నాలుగు నెలల జీతాలు కరువయ్యాయి.

పంచాయతీ కార్యదర్శులకు తప్పని తిప్పలు..

ఈ భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతుంది. ఉదయం 7గంటలకు విధుల్లో చేరితే రాత్రి 10 గంటలకు పనులు పూర్తి కావడం లేదు. హరితహారం, ఉపాధి హామీ పథ నిర్వహణ, పల్లె ప్రగతి, పన్నుల వసూలు, జనన, మరణాల నమోదు, కల్యాణలక్ష్మి తదితర ధ్రువపత్రాలు వంటి పనులు తోడు వడంతో వారు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పెద్ద గ్రామ పంచాయతీలు నీరు, ఇంటి ట్యాక్స్ వసూలు చేసి, పంచాయతీలో పనులు చేసుకోంటున్నారు. కానీ వెయ్యిలోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీల పరిస్థితి మరి అధ్వాన్నంగా తయారైంది.



అనుముల మండలంలోని చింతగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం

నిధులు రాక ఇబ్బందులు..

గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ ఇచ్చే నిధులు ముఖ్యమైన ఆర్థిక ఆధారాలు. జనాభాకు అనుగుణంగా ఒక్కొక్కరికి రూ. 812 చొప్పున 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తోంది. కాగా 2022 ఆగస్టు నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు రావడం లేదు. ప్రత్యేక పాలన ప్రారంభం అయినప్పటి నుంచి అవికూడా రావడం లేదు. పెద్ద గ్రామపంచాయతీల్లో ఇంటి పన్నులు, తైబజార్, ఇంటి నిర్మాణ ఫీజులు, వ్యాపార వాణిజ్య లైసెన్స్ ఫీజులు నుంచి పంచాయతీల్లో డబ్బులు జమ చేసుకోంటున్నారు. కానీ చిన్న గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే నిధులు తప్పా ఆర్థిక ఆధారాలు లేవు. ప్రత్యేక అధికారులు గ్రామ పంచాయతీల వైపు తొంగిచూడటం లేదు.

అప్పుల పాలు..

పంచాయతీల నిర్వహణకు నాలుగు నెలల కాలంగా కార్యదర్శులు రూ. 30వేల నుంచి రూ. 40వేల వరకు అప్పులు తప్పలేదు. గతంలో చెత్తసేకరణ కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ఆటోలు పంచాయతీ కార్యదర్శుల పేరిట రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఆయా వాహనాల నెల కిస్తు కట్టకపోతే వారి సొంత బ్యాంకు ఖాతాలకు సంబంధించిన సిబిల్ స్కోరు పడిపోతుందని సంబంధిత కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే చెత్త సేకరించే వాహనాల డీజిల్ ఖర్చు, నీటి సమస్య తీర్చేందుకు బోర్ల మరమ్మతు, విద్యుద్దీపాలు తదితర వాటికి నిధుల్లేక తప్పనిసరి అప్పులు చేయాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. పంచాయతీ ఎన్నికలు జరిగే వరకు పాలన ఎటు పోతుందో ప్రశ్నార్థకంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పనిభారం తగ్గించాలి



పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి. చెత్త సేకరించే ట్రాక్టర్, ఇతర వాహనాలు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఖర్చులు కార్యదర్శులపై భారంగా మారాయి. డీఎస్ఆర్ యాప్‌తో ఇబ్బందులు తీవ్రమయ్యాయి. పంచాయతీ ఖాతాల్లో నిధులు లేక మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు చెల్లించే పరిస్థితి లేదు.

– కోడిరెక్క రాజేందర్‌కుమార్, కార్యదర్శుల సంఘం జిల్లా అసోసియేట్ గౌరవ అధ్యక్షుడు.

బాధిత రైతులకు త్వరలోనే భూ పట్టాలు

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

డిండి : ఇరిగేషన్ శాఖకు భూములు బదిలీ అయిన బాధిత రైతులకు త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరిగి పట్టాలు అందిస్తామని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మాధవరం సునీతా జనార్దన్‌రావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలోని అధికారులు బాధ్యతగా పనిచేస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే ఆదేశించారు. దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని పర్యటించి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ ఇచ్చిన డిండి పట్టణానికి స్థానిక రాజీవ్‌గాంధీ చౌరస్తా నుండి అంగడి బజార్ ద్వారా ప్రభుత్వ విత్తనోత్పత్తి కేంద్రం వరకు డబుల్ లేన్ బీటీ రోడ్డుతో పాటు లైటింగ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. పీహెచ్‌సీకి 108 అంబులెన్స్‌తోపాటు మరో వైద్యాధికారిని నియమించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. అదేవిధంగా ఆదర్శ పాఠశాలలో చేపట్టే పెండింగ్ పనులకు రూ.32లక్షలు మంజూరు చేసి ఇప్పటికే టెండర్లు పూర్తి చేసినట్లు తెలిపారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు వాడితే, ప్రభుత్వ పనులు, ఇంటి నిర్మాణానికి ఇసుక తరలించే క్రమంలో బ్లాక్ మెయిల్‌కు పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎస్ఐ.రాజుకు సూచించారు. అనంతరం జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు చివరి సర్వసభ్య సమావేశం కావడంతో వారికి శాలువా కప్పి షీల్డ్‌ను ఆయన అందజేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ దేవేందర్‌రావు, తహసీల్దార్ తిర్పతయ్య, ఎంపీడీఓ డానియల్, కో ఆప్షన్ మెంబర్ జహంగీర్ వివిధ మండల శాఖాధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి


దేవరకొండ : డీఎస్పీని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్


పెద్దవూర : పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

దేవరకొండ : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను సమగ్రంగా విచారించి వెంటనే పరిష్కరించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పేర్కొన్నారు. శుక్రవారం దేవరకొండ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దేవరకొండ డివిజన్ పరిధిలో ఎలాంటి కేసులు ఎక్కువగా నమోదవుతాయో డీఎస్పీని అడిగి తెలుసుకున్నారు. రోజూ వచ్చే ఫిర్యాదులు, స్టేషన్ పరిసరాలు, సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ వంటి అంశాలపై ఆరా తీశారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డీఎస్పీ గిరిబాబు, సీఐ నర్సింహులు ఉన్నారు.

పోలీసులకు సహకరించాలి

చందంపేట : శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ చందంపేట పోలీసులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలనుఅడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ గిరిబాబు, రూరల్ సీఐ సురేష్, ఎస్ఐ సతీష్ ఉన్నారు.

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను ఎస్పీ పరిశీలించి, కేసుల పురోగతి, శాంతిభద్రతల అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ గిరిబాబు, సీఐ ధనుంజయ, ఎస్ఐ రామ్మూర్తి తదితరులున్నారు.

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద గల గుడిపల్లి పోలీస్ స్టేషన్‌ను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట దేవరకొండ డీఎస్పీ గిరిబాబు,కొండమల్లేపల్లి సీఐ దనుంజయ్, ఎస్ఐ నర్సింహులు తదితరులున్నారు.

తక్షణమే స్పందించాలి

పెద్దవూర : ప్రజా ఫిర్యాదులో జాప్యం జరగకుండా తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ సూచించారు. శుక్రవారం పెద్దవూర పోలీసు స్టేషన్‌ను ఆకస్మింగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన రిసిప్షెన్, జీడీ ఎంట్రీ రికార్డులను పరిశీలించారు. డయల్ 100 కాల్ రాగానే తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకోవాలన్నారు. సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా నిర్వహించినప్పుడే శాంతి భద్రతలు అదుపులో ఉంటాయని అన్నారు. ఈయన వెంట మిర్యాలగూడెం డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సాగర్ సీఐ బీసన్న , ఎస్ఐ వీరబాబు , సిబ్బంది ఉన్నారు.

హాలియా పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ

హాలియా : హాలియా పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లో ఫిర్యాదులు, స్టేషన్ పరిసరాలు, సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల స్థితిగతులు, నేరాలు జరిగే ప్రాంతాలు, పాత నేరస్తుల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, సీఐ జనార్ధన్ గౌడ్, ఎస్ఐ సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేసినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని రాజవరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగాల వెంకటరాములు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ విరమణ అనేది ప్రతి ఒక్క అధికారి జీవితంలో సర్వసాధారణమన్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడే ప్రజల మన్ననలు పొందే విధంగా పని చేయాలని ఆయన సూచించారు. అన్ని వృత్తుల్లోకెల్ల ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని తెలిపారు. ఒక వ్యక్తి ఉన్నతమైన స్థానంలో ఉన్నాడంటే దానికి కారణం ఉపాధ్యాయుడేనన్నారు. ఎంతో మంది ఉపాధ్యాయులను విద్యావంతులుగా తీర్చిదిద్దిన జంగాల వెంకట్‌రాములు, ఆయన సతీమణి జంగాల లక్ష్మీని ఆయన ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తరి రాము, ఎంఎన్ఓ శ్రీనివాస్, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు కొంగరి సత్యనారాయణ, మందా సైదులురావు గౌతమ్, యూటీఎఫ్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు ఎరనాగుల సైదులు, పరశురాం, ఉపాధ్యాయులు వీరాసింగ్, ప్రసాద్ పాల్గొన్నారు.


ఉద్యోగ విరమణ పొందిన వెంకట్రాములును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

బంగారు మైసమ్మ ఆలయానికి రూ.22.50లక్షల ఆదాయం

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని కల్లెపల్లి బంగారు మైసమ్మ దేవస్థానంలో వివిధ విక్రయాల హక్కుల కోసం నిర్వహించిన వేలంలో రూ.22.50లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి, చైర్మన్ ధీరావత్ భాష్యానాయక్‌లు తెలిపారు. శుక్రవారం నల్లగొండ దేవాదాయశాఖ కమిషనర్ కె. మహేంద్రకుమార్ సమక్షంలో వేలం నిర్వహించారు. దున్నపోతులు సేకరించుకునే హక్కుకు రూ.18.50లక్షలు, కొబ్బరి చిప్పలు సేకరించుకునే హక్కుకు రూ.2లక్షల తోపాటు తలనీలాలు సేకరించుకునే హక్కుకు రూ. 2లక్షలు మొత్తం రూ.22.50లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కాగా వేలం సందర్భంగా ఆలయం వద్ద ఎస్ఐ రవి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాలోతు జనార్దన్, మాజీ దేవాలయ చైర్మన్ పాచ్చునాయక్, మాజీ ఎంపీటీసీ నెహ్రూనాయక్, కమిటీ సభ్యులు కోట్యా, భీమా శంక్రియా, ఆలయ పూజారులు వెంకటేశ్వర్లు, రామ్మోహన్, లింగానాయక్, మేష్యానాయక్, మహంకాళీ, జానకిరాములు పాల్గొన్నారు.


ఆలయం వద్ద వేలం నిర్వహిస్తున్న అధికారులు

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు


కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి

దేవరకొండ : వ్యాపారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి పి.రామకృష్ణ అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని పలు కిరాణ దుకాణాల్లో వస్తువుల ప్యాకేజీలపై తయారీ అడ్రస్, ఎమ్మార్పీ, తయారీ తేదీ, కస్టమర్ కేర్ నంబర్, ఈ మెయిల్ ఐడి వంటి వివరాలు లేకపోవడంతో కేసులు నమోదు చేసి రూ.లక్షా80వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులు తమ దుకాణాల్లో డిక్లరేషన్ లేని ప్యాకేజీలు అమ్మరాదని, తనిఖీల్లో వెలుగు చూసినట్లయితే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. అంతేగాకుండా ప్యాకింగ్ చేసేవారు విధిగా లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుందని సూచించారు. వినియోగదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులున్నా లీగల్ మెట్రాలజీ శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు. సెల్ నంబర్ 9010651783 కి వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చన్నారు.

మెనూ పాటించాలి

చింతపల్లి : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని డీఈఓ భిక్షపతి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగవంతంగా సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సమయపాలన పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

ఎరువులు అధిక ధరలకు విక్రయించొద్దు

చింతపల్లి : ఎరువుల దుకాణదారులు నిబంధనలు అతిక్రమించి అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దేవరకొండ డివిజన్ సహాయ సంచాలకురాలు శ్రీలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వర నగర్ ఎరువులు దుకాణాల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతులకు ఎరువులు సకాలంలో ఉంచాలని, పురుగు మందులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల అమ్మకం వివరాలను రికార్డులో ప్రతి రోజూ పొందుపర్చాలని సూచించారు. వానాకాలం పంటలు వేసిన రైతులు సర్వే నంబర్ల వారీగా వ్యవసాయ విస్తరణాధికారుల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి శ్రావణికుమారి, ఏఈవోలు మధు, శ్రీలత, డీలర్లు యాదయ్య, వాస శ్రీను, వెంకటయ్య, ప్రసాద్, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీలక్ష్మి

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

వేములపల్లి : ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధని అన్నారు. శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు తంగెళ్ల నాగమణి, పెంటమల్ల సుకన్య పాల్గొన్నారు.

నూతన కేజీబీవీ భవనాన్ని ప్రారంభించాలి

మిర్యాలగూడ : అడవిదేవులపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ పాఠశాల భవనాన్ని ప్రారంభించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీఓ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్, సైదానాయక్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజులు కావొస్తున్నా ప్రభుత్వం కేజీబీవీ విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. విద్యార్థినులు ఆ పాత భవనంలోని ఇరుకు గదుల్లో విద్యనభ్యసిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే నూతనంగా నిర్మించిన కేజీబీవీ భవనాన్ని ప్రారంభించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. నూ మాన్, అనిల్, అజయ్, సిపాయి, కార్తీక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ధర్నా


డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

మిర్యాలగూడ టౌన్ : ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో గేటు ఎదుట కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు 2013 (బాండ్) డబ్బులతో పాటు 2017 వరకు వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులకు అపాయింట్ డే ప్రకటించాలన్నారు. అదే విధంగా ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు కడియం రమేష్, కేవీ రెడ్డి, పి. సైదులు, సంతోష్‌రెడ్డి, సంధ్యారాణి, నిర్మల, శారధ, సరస్వతి, కేపి సింగ్, కనకయ్య, బివై కోటయ్య, శ్రీకాంత్‌రెడ్డి, దుర్గయ్య, పేరం రోశయ్య, చంద్రయత్య, ఆర్‌కె నాయక్ తదితరులున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు


తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

చింతపల్లి : గ్రామాల్లోని రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు ప్రజావాణి భాగంగా చేసే దరఖాస్తులతో పాటు ధరణిలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారం దిశగా ఇప్పటికే రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దశల వారీగా దరణి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. భూమి హద్దులు, నక్ష రోడ్లు, పెండింగ్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు. ఆయన వెంట ఏడి శ్రీనివాసులు, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్ఐ యాదయ్య, సర్వేయర్ రతన్‌లాల్ పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలి

పెద్దవూర : గ్రామపంచాయతీల్లో నిధులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం ఎంపీడీఓ వర్కాల మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసే నాటికి నిధులు మొత్తం సర్పంచ్‌లు డ్రా చేసుకోవడంతో శానిటేషన్, వాటర్, లైటింగ్ వంటి పనులను కూడా చేయించలేని స్థితిలో ఉన్నట్లు తెలిపారు. దీనికి తోడు కలెక్టర్ ప్రతి గురువారం గ్రామపంచాయతీల్లో ప్రజావాణి నిర్వహించాలని ఆదేశించడంతో గ్రామస్థాయిలో వచ్చిన ఫిర్యాదులు పరిష్కరించాలన్నా నిధులు అవసరం అవ్వడంతో వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు సన్మానం


హాలియా : : ప్రమోషన్ పొందిన వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు


కొండమల్లేపల్లి : మాధవరెడ్డిని సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు

హాలియా : డిండి మండలంలోని కామేపల్లి పాఠశాలకు హెచ్‌ఎంగా ప్రమోషన్‌పై వెళ్లిన నెమలి వెంకట్‌రెడ్డిని శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపల్లి గెజిటెడ్ హెచ్‌ఎం దాసా వెంకన్న ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దాసా వెంకన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందా సైదులు రావు గౌతమ్, కుర్మారెడ్డి, రామకృష్ణ, రాజ్యలక్ష్మి, ప్రశాంత్‌కుమార్, అస్మత్ తారా, జ్యోతి, వాణీ తదితరులు ఉన్నారు.

కొండమల్లేపల్లి : మండలంలోని చిన్నఅడిశర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయుడు ఎ.మాధవరెడ్డిని శుక్రవారం గ్రామ మాజి సర్పంచ్ గడ్డం శ్రీరాములు, పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీలా స్వరాజ్యలక్ష్మి, రవికుమార్ పాల్గొన్నారు.

దండోరా రజతోత్సవాల కరపత్రం ఆవిష్కరణ

దేవరకొండ : జూలై 7న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీలో నిర్వహించే దండోరా రజతోత్సవాల ప్రచార కరపత్రాలను శుక్రవారం దేవరకొండ పట్టణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోతెం సహదేవులు మాట్లాడుతూ దండోరా రజతోత్సవానలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాశయ్య, నగేష్, సంజీవ, గిరి పాల్గొన్నారు.

చందంపేట : జూలై 7న హైదరాబాద్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్ దండోరా రజతోత్సవాలను విజయవంతం చేయాలని చందంపేట మండల ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు కొండ్రపల్లి నగేష్‌మాదిగ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో పోతెం సహదేవుడు, కాశయ్య, అన్నెపాక సంజీవ, గిరి, నగేష్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : జూలై 7న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న ఆధ్వర్యంలో నిర్వహించే దండోరా రజతోత్సవాలను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అన్నెపాక సంజీవ కోరారు. ఈమేరకు స్థానిక చౌరస్తా వద్ద కరపత్రం ఆవిష్కరించి మాట్లడారు. ఈ కార్యక్రమంలో పోతెం సహదేవులు, మాతంగి కాశయ్య, కొండ్రపల్లి నగేస్, మారపాక గిరి, నాగేష్, సహదేవుడు, లక్ష్మయ్య, అంజయ్య పాల్గొన్నారు.


దేవరకొండ : కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు